24న ఎన్ఎంఎంఎస్ఎస్ రాష్ట్రస్థాయి పరీక్ష

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్ఎస్)కు 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 24 (ఆదివారం)న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాష్ట్రస్థాయి పరీక్ష జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు బుధవారం నుంచి http://bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

నాన్ మెడికల్ ప్రాక్టీషనర్లను ప్రోత్సహిస్తే ప్రజల మద్దతు కోల్పోతారు

- ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖ హెచ్చరిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నాన్ మెడికల్ ప్రాక్టీషనర్లను వైద్యచికిత్సల పట్ల ప్రోత్సహిస్తూ వారి ద్వారా లబ్ధిపొందాలనుకుని ప్రయత్నిస్తే భవిష్యత్తులో డాక్టర్లు ప్రజల మద్దతును కోల్పోయే ప్రమాదం వుందని ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖ హెచ్చరించింది. ఐఎంఏ కూడా ఇలాంటి విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చెయ్యడం జరుగుతుందని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దువ్వూరు ద్వారకానాధరెడ్డి, కార్యదర్శి డాక్టరు అశోక్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ప్రయివేటు ఆస్పత్రి నాన్ మెడికల్ ప్రాక్టీషనర్లను విదేశాలకు విందు కోసం తీసుకెళ్లి, జల్సాలను అనుభవిస్తున్నారంటూ వచ్చినసమాచారం పట్ల ఐఎంఏ రాష్ట్ర శాఖ స్పందించింది. నాన్ మెడికల్ ప్రాక్టీషనర్లు కేవలం పల్లెల్లో ఏదైనా జరిగినపుడు ప్రజలకు ఫస్ట్ ఎయిడ్ చెయ్యడానికి మాత్రమే పరిమితమని, కనీసం ఇంజెక్షన్లు కూడా వెయ్యడానికి వీలులేదని స్పష్టం చేశారు. అలాంటి వారిని గ్రామాల్లో ప్రజలకు వైద్యం చేసేలా ప్రోత్సహిస్తూ, పేషంట్ల రెఫరల్స్ కోసం, వారిని లోబరుచుకోడానికి విదేశాలకు తీసుకెళ్లి విందుభోజనాలు ఏర్పాటు చేస్తే మెడికల్ కమ్యూనిటీ మొత్తాన్ని ప్రజలు ద్వేషించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

లగచర్ల ఘటనపై మాటల యుద్ధం

- అధికార, విపక్ష నేతల విమర్శలు, ప్రతివిమర్శలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లగచర్ల ఘటన నేపథ్యంలో అధికార, విపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కుట్రపూరితంగానే వికారాబాద్ కలెక్టర్, ఇతర అధికారులపై బిఆర్ఎస్ శ్రేణులు దాడి చేశాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను రెచ్చగొట్టడం బిఆర్ఎస్‌కు అలవాటేనని ఆరోపించారు. లగచర్ల ఘటనలో ఎ1గా ఉన్న పట్నం మహేందర్‌రెడ్డితో కెటిఆర్ అనేక సార్లు మాట్లాడారని, దీని వెనక ఎంతటివారున్నా వదిలే ప్రసక్తే లేదని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్నం మహేందర్ రెడ్డి అరెస్టును బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఖండించారు. ఫార్మా సిటీకి వ్యతిరేకంగా ప్రజలు చేసిన తిరుగుబాటును బిఆర్ఎస్‌కు ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పచ్చటి పొలాల్లో చిచ్చు పెట్టడమే ప్రజా పాలనా? అని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు.

గుర్తిస్తాం... శిక్షిస్తాం

- వికారాబాద్ ఘటనపై పొంగులేటి వ్యాఖ్యలు
- రైతుల పేరుతో పింక్ కలర్స్ దౌర్జన్యం
- ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు బిఆర్ఎస్ కుట్రలు
- త్వరలో కొత్త ఓఆర్ఆర్ చట్టం
- ప్రతీ ధాన్యపు గింజా కొంటాం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ ఘటన వెనుక ఉన్న కుట్రదారులను గుర్తిస్తామనీ, దాడి పాల్పడిన ప్రతి ఒక్కరినీ చట్ట ప్రకారం శిక్షిస్తామని సమాచార, పౌరసంబంధాల, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. లగచర్ల ఘటనపై కాస్త ఓపిక పడితే ఒక్కొక్కటిగా అన్ని విషయాలూ బయటకొస్తాయన్నారు. ఆ తర్వాత నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని చెప్పారు. ప్రతిపక్షం మాదిరిగా తాము తొందర పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్స్ ముసుగు వేసుకుని అధికారులపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. భూములు, ఇళ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగ, ఉపాధి సమస్యలపై మంత్రి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని భూ సమస్యలపై 20మంది కలెక్టర్లతో మాట్లాడారు. ఇద్దరు ఎస్‌పిలతో నేరుగా మాట్లాడి బాధితుల సమస్యలను వివరించారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున గాంధీభవన్‌కు వచ్చి పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందికరంగా మారిన ధరణి పోర్టల్‌ను విదేశీ కంపెనీ నుంచి విడిపించామని చెప్పారు. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకరాబోతున్న నూతన ఆర్ఓఆర్ చట్టం దేశానికే రోల్ మోడల్ కాబోతున్నదని చెప్పారు. త్వరలో ఉద్యోగాల నియామకాలను చేపడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొంతమంది కుట్రలు చేస్తున్నారనీ, అలాంటి వారి ఆగడాలను సాగబోనివ్వమని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లు అంటే ఇందిరమ్మ రాజ్యమని, అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించామన్నారు. బిఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్‌ల ఆశ పెట్టి గత పదేండ్లపాటు ఎన్నికల్లో గెలిచిందనీ, కానీ వారికి ఇంతవరకూ ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 24 లక్షల ఇండ్లు కట్టిస్తామన్నారు. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. లబ్ధిదారులు నాలుగు వందల చదరపు అడుగుల జాగాలో ఇల్లు కట్టుకోవాలని సూచించారు. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం డబ్బు ఇస్తుందన్నారు. విడతల వారీగా రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తామనీ, అది మహిళా యజమాని పేరిట ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో తొండాట ఆడబోమన్నారు. రైతు రుణమాఫీ కింద రూ.రెండు లక్షల చొప్పున ఇంకా కొంత మంది రైతులకు అందించాల్సి ఉందని చెప్పారు. మిగిలిన అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవమేనని, అభివృద్ధి సంక్షేమం రెండు కండ్లుగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెప్పారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంది. ప్రతిపక్షాలు ధర్నాలు, నిరసనలు చేయాల్సిన అవసరం లేదు. అధికారంలో ఉన్నప్పుడు అన్నదాతలను జైళ్లలో పెట్టినవారు ఇప్పుడు పచ్చ కండువా వేసుకుని వారి వద్దకే వెళ్లి మద్దతు ఇస్తున్నామని చెబుతున్నారు. బిఆర్ఎస్ హయాంలో రైతన్నలను జైళ్లలో పెట్టి ఇప్పుడు ధర్నాలు, నిరాహార దీక్షలు, పోరాటాలు అంటూ వారిని మోసం చేస్తున్నారు. ధరణి చట్టంతో అనేక ఇబ్బందులు పడ్డామని రైతులు, భూ యజమానులు చెప్పిన విషయం గుర్తు లేదా?' అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ మాత్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని విమర్శించారు. అబద్ధాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

మెడికవర్ హాస్పిటల్స్‌కు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు

- ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అనిల్ కృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెడికవర్ హాస్పిటల్స్‌కి రాజకీయ పార్టీలకు ఎటువంటి సంబంధం లేదని ఆస్పత్రి యాజమాన్యం స్పష్టం చేసింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అనిల్ కృష్ణ స్పందించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటిగా తమ ప్రస్థానం హైటెక్ సిటీ నందు అప్పటి సిఎం కెసిఆర్ చేతుల మీదగా ప్రాంభించడం జరిగిందని చెప్పారు. తదనంతరం మెడికవర్ హాస్పిటల్స్ - స్వీడిష్ (యూరోపియాన్) కంపెనీ వారికీ మెజారిటీ స్టేక్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఒక ప్రపంచ ప్రసిద్ధ ఆరోగ్య సంస్థగా, మెడికవర్ 13 దేశాలలో సేవలందిస్తోందని వివరించారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అన్నం శరత్ రెడ్డి మాక్స్‌బీన్ ఫార్మాలో డైరెక్టర్ కాదని స్పష్టం చేశారు. మెడికవర్ హాస్పిటల్స్ గురించి కెటిఆర్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నం శరత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఏడాది పాలనపై నేడు ప్రజా విజయోత్సవ సభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి ఏడాది కావస్తున్న నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రజా విజయోత్సవ సభ పేరిట ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల ముందిచ్చిన గ్యారంటీలు గమ్యం చేరే దిశగా సర్కార్ అడుగుల వేస్తోంది. పదేండ్ల ఆర్థిక విధ్వంసాన్ని చక్క దిద్దుతూనే సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజలకు చేరువయ్యేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతేడాది డిసెంబర్ 7న ఇదే ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి డిసెంబరు 9వరకు 26 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా విజయోత్సవాల'ను నిర్వహించ నున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

జాతీయస్థాయిలో గిరిజన కీర్తి పతాక.. కార్తీక్

- మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎగ్జామ్‌లో ర్యాంక్
- పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్‌గా కార్తీక్ ఎంపిక
- ఆన్‌లైన్ కోచింగ్‌తోనే అందివచ్చిన సక్సెస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అన్నట్టు గిరిజన ఆణిముత్యం మాలోత్ కార్తీక్ చిన్ననాటి నుంచి చదువులో రాణిస్తున్నారు. తాను జన్మించింది.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మారుమూల గిరిజన తండాలోనైనా అతని చదువులో రాణిస్తున్న తీరుతో స్వగ్రామం సుకినితండాకు పేరు ప్రఖ్యాతులు దక్కుతున్నాయి. మూడేళ్ల క్రితం ఇంజనీరింగ్ సర్వీస్ ఎగ్జామ్‌లో జాతీయస్థాయి 27వ ర్యాంక్ సాధించిన కార్తీక్ లిగ్నైట్ ఇండియా లిమిటెడ్‌లో డిఇగా ఉద్యోగం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఐఇఎస్‌లో ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఆరుగురిని ఎంపిక చేయగా కార్తీక్ నాలుగో స్థానం పొందటం గమనార్హం. ఇప్పుడు అదే పట్టుదలతో ఆన్‌లైన్‌లో విద్యనభ్యసిస్తూ మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్'గా ఎంపికయ్యారు. ఈ పరీక్షలో మాలోత్ కార్తీక్ జాతీయ స్థాయిలో 515వ ర్యాంక్ సాధించారు. గతేడాది డిసెంబర్‌లో ప్రాథమిక పరీక్ష, ఈ ఏడాది జనవరి 25న నిర్వహించిన మెయిన్స్ పేపర్-1, ఫిబ్రవరి 5న మెయిన్స్ పేపర్-2, ఏప్రిల్ 1 నుంచి 26 మధ్య నిర్వహించిన ఆఫ్‌లైన్ ఇంటర్వ్యూలకు కార్తీక్ హాజరయ్యారు. ఇందులో ఆయన ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో 515వ ర్యాంక్ పొందారు. గ్రూప్-ఏ గెజిటెడ్ స్థాయి ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలవడంతో కార్తీక్ తల్లిదండ్రులు పార్వతి, బాష హర్షం వెలిబుచ్చారు.

మాలోత్ కార్తీక్ చిన్ననాటి నుంచి చదువులో మేటిగా నిలుస్తున్నారు. కార్తీక్ ఖమ్మంలో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్, గౌహతి ఐఐటీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌ను 2019లో పూర్తి చేశారు. చిన్ననాటి నుంచి నేటి వరకు ప్రతి పరీక్షల్లోనూ టాపర్‌గానే నిలుస్తున్నారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఐఎఎస్, ఐపిఎస్, ఇంజనీరింగ్ సర్వీసులకు ఎంపిక కావడమే తన లక్ష్యమని మాలోత్ కార్తీక్ తెలిపారు. కష్టపడి చదవడంతో పాటు అన్ని సబ్జెక్ట్‌లపై పట్టు సాధిస్తే ఏ పరీక్ష అయినా సక్సెస్ కావొచ్చుని, జాతీయ స్థాయిలో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. కాగా, జాతీయ స్థాయి పరీక్షలో ర్యాంకు సాధించిన కార్తీక్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, అక్కడే రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న అతని తల్లి పార్వతి, వైరాలోనే ఎక్సైజ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అతని తండ్రి బాష, అక్క మౌనిక, వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహారావు, తెలంగాణ గిరిజన సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం తదితరులు అభినందించారు. కుటుంబసభ్యులతో పాటు వీరంతా ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు.

కులగణన సర్వే పేరుతో వ్యక్తిగత వివరాల సేకరణ తగదు

- ప్రజల్లో సందేహాలను అఖిలపక్షంలో ప్రభుత్వం నివృత్తి చేయాలి : తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలను సేకరించడం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దేశ జనాభా లెక్కల్లో కులగణన చేర్చాలనే చర్చ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వే పత్రంలో కులంతోపాటు ఆస్తులు, రాజకీయ, వ్యవసాయ భూములకు సంబంధించిన వ్యక్తిగత వివరాలతో కూడిన ప్రశ్నలున్నాయని వివరించారు. ఆ వివరాలను ఇవ్వడానికి పలు అనుమానాలు, వ్యతిరేకత ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. అటువంటి ప్రశ్నలను మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వ్యక్తిగత ప్రశ్నలకు సంబంధించిన వివరాలు వెల్లడించడానికి ప్రజలు విముఖత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని చోట్ల ఎదురుతిరుగుతున్నట్టు, దాడులు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డులు తొలగించడానికి, సంక్షేమ పథకాలు రద్దు చేయడానికే ఈ సర్వే చేస్తున్నారంటూ ప్రజల్లో సందేహాలు రేకెత్తుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని చోట్ల సర్వే చేస్తున్న వారిని వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లను అనుమానించే సందర్భాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల పై అంశాలపై ప్రభుత్వం స్పందించి, అఖిలపక్ష సమావేశం నిర్వహించి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు.

పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించాలి

- ఆత్మహత్యలను నివారించాలి : కూరపాటి రమేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వస్త్ర పరిశ్రమపైనే ఆధారపడి బతుకుతున్న పవర్‌లూమ్ కార్మికుల పట్ల సర్కారు నిర్లక్ష్యం తగదనీ, వారికి సరైన ఉపాధి చూపి ఆదుకోవాలని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే సిరిసిల్ల ప్రాంతంలో 16 మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల వ్యవధిలోనే బైరి అమర్, స్రవంతి దంపతులు, ఎర్రం కొమురయ్య అనే పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం సమస్య తీవ్రతను తెలుపుతుందని తెలిపారు. ఇంతమంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. సిరిసిల్ల ఉరిసిల్లగా మారుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పవర్‌లూమ్ కార్మికుల చావులకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గతంలో బతుకమ్మ చీరల పథకం వల్ల కార్మికులకు ఉపాధి కలిగేదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేసిందని వాపోయారు. దీనివల్ల కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బతుకమ్మ చీరల స్థానంలో మహిళా స్వయం సహాయక బృందంలోని మహిళలకు రెండు చీరలు చొప్పున ఇస్తామని, దీని ద్వారా కార్మికులకు ఉపాధి కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందిగానీ ఉత్పత్తిని మాత్రం ప్రారంభించలేదని తెలిపారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యల తీవ్రతను అర్థం చేసుకొని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చీరలను ఉత్పత్తిని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వర్కర్ టు ఓనర్ పథకం కోసం నిర్మించిన 44 వర్క్‌షెడ్‌లను ఇతర సంస్థలకు అద్దెకిస్తూ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. కార్మికులకే షెడ్లను కేటాయించాలని కోరారు.

కొత్త కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ లక్ష్మణ్

తెలుగులో సమగ్రమైన పదకోశం అవసరం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

ప్రజాశక్తి-కల్చరల్

పొరుగు రాష్ట్రాల వారి భాషలకు చెందిన పదకోశం సమగ్రంగా ఉన్నందున అక్కడ తీర్పులు త్వరితంగా అనువాదం అవుతున్నాయనీ, తెలుగు భాషలోనూ సమగ్రమైన పదకోశం అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ అన్నారు. ఫిర్యాదుదారులు తమ భాషలో తీర్పులు తెలుసుకొవడం అవసరమని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో 52 మంది రచయితలు రాసిన కొత్త కథలు 6వ భాగం ఆవిష్కరణ సభ బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ లక్ష్మణ్ సంపుటినీ ఆవిష్కరించి మాట్లాడారు. వాస్తవాన్ని కథల రూపంలో అందించే రచయితలు సమాజ హితానికి దోహద పడతారని చెప్పారు నేడు అత్యధిక కేసులు ఫ్యామిలీ కోర్టులో ఉంటానికి కారణం సమాజానికి సరైన దిశా నిర్దేశనం లేకపోవడమేనని చెప్పారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ సమాజ జీవితానికి మనిషి జీవితానికి సంబధం తెలిపేదే కథని అన్నారు. భారతీయ సాహిత్య చరిత్ర కథతోనే ఆరంభమైందని తెలిపారు. గ్రంథ స్వీకర్త డాక్టర్ ఆళ్ళ శ్రీనివాస్‌రెడ్డి హృద్రోగ నిపుణులుగా అమెరికాలో ఉన్నా.. తెలుగు భాష సంస్కృతి, సంప్రదాయాలు గొప్పగా అభిమానించే వ్యక్తిత్వం వారిది అని కొనియాడారు. డాక్టర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తనకు తెలుగు సహిత్యం అంటే విపరీత అభిమానం అనీ అమెరికా స్థిర నివాసంగా ఉన్నా సినారే, వంశీ సంస్థల సంపుటిల ప్రచురణకు సహకారం అందిస్తున్నాను అని చెప్పారు.

బతుకమ్మకుంట ఇళ్ల జోలికెళ్లం..

- పూర్వ వైభవం తీసుకొస్తాం
- హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను పునరుద్ధరించి దానికి పూర్వ వైభవం తీసుకొస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఖాళీ స్థలం చుట్టుపక్కల ఉన్న ఇండ్లకు ఎలాంటి నష్టమూ వాటిల్లకుండా, వాటి జోలికి వెళ్లకుండా కుంటను పునరుద్ధరించి మంచి పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. జిహెచ్ఎంసి అధికారులు, అంబర్‌పేట రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి బుధవారం హైడ్రా కమిషనర్ బతుకమ్మకుంటను సందర్శించారు. మొదట స్థానిక వీకర్ సెక్షన్ వద్దకు వెళ్లి ఇండ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్చబోమని చెప్పారు. ప్రస్తుతం ఉన్న బతుకమ్మకుంట 5.15 ఎకరాల్లోనే చెరువును పునరుద్ధరిస్తామని, దాంతో స్థానికులకు వరద ముప్పు తప్పి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని కమిషనర్ చెప్పారు. సర్వేనెంబర్ 563లో 1962-63 ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మకుంట ఉండేదని, బఫర్‌జోన్‌తో కలిసి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణం అని సర్వే అధికారులు తేల్చారన్నారు. తాజా సర్వే ప్రకారం.. 5.15 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దాన్ని పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఒకప్పటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మకుంటగా మారిందని, రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయని అన్నారు. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందని స్థానికులు కమిషనర్‌కు చెప్పారు. మళ్లీ బతుకమ్మకుంటకు పూర్వ వైభవం తీసుకురావాలంటూ హైడ్రా కమిషనర్‌కు విన్నవించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులు చేపడతామన్నారు. కుంట నీటితో కళకళలాడితే పరిసర ప్రాంతాల్లో పర్యావరణం, భూగర్భ జలాల పెరుగుదలతోపాటు ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని కమిషనర్ తెలిపారు. జేసీబీలో వెంటనే పనులు మొదలు పెట్టాలని అధికారులకు చెప్పారు. అధికారులు జెసిబిలను తెప్పించి పిచ్చిమొక్కలు, నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించే పనులు ప్రారంభించారు. ఈ పర్యటనలో హైడ్రా డిప్యూటీ కమిషనర్ సుధ, హైడ్రా డిప్యూటీ సిటీ ప్లానర్ రాంరెడ్డి, అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్, తహశీల్దార్ వీరాభాయి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుమిత్రలతో పాటు ఇరిగేషన్ విభాగం అధికారులు ఉన్నారు. కమిషనర్ పర్యటన నేపథ్యంలో పెద్దఎత్తున పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే, తార్నాకలోని ఎర్రకుంట చెరువును కూడా హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా 5.9 ఎకరాల్లో విస్తరించిన చెరువును పునరుద్ధరించి.. సుందరీకరిస్తే దుర్వాసన, దోమల బెడద తప్పుతుందని కమిషనర్‌ను స్థానికులు కోరారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎర్రకుంటను పరిశీలించి.. పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలంటూ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

నాగారంలో అక్రమ నిర్మాణం కూల్చివేత

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం మున్సిపాలిటీలో రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టారని సమీప కాలనీ వాసులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు బుధవారం పోలీసు బలగాలతో వెళ్లి జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని కూల్చేశారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులు మాట్లాడుతూ.. రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీల వాసులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అన్ని పత్రాలూ పరిశీలించిన అనంతరం రోడ్డు స్థలం ప్రజలు వినియోగించుకునేలా గోడను కూల్చేమని చెప్పారు.

సుద్దాల అశోక్ తేజను సత్కరించిన నిర్వాహకులు

మాతృభాష రానివాడు మేధావి కాలేడు

- పూర్వ గవర్నర్ విద్యాసాగర్‌రావు

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు భాషకు సినారె వంటి వారితో పాటు నేడు సుద్దాల అశోక్ తేజ తరం వారు పట్టం కడుతున్నారని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ విద్యాసాగర్ రావు అన్నారు. మాతృ భాష రానివాడు మేధావి కాలేడని అయన అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయినా భాష పరిరక్షణకు ఒకే మడి కట్టులో కలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో సినారె ఆళ్ళ స్వర్ణ కంకణం గీత రచయిత సుద్దాల అశోక్ తేజకు బహుకరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విద్యా సాగర రావు స్వర్ణ కంకణం అశోక్ తేజకు ప్రదానం చేసి మాట్లాడారు. సుద్దాల అశోక్ తేజకు అడవి తల్లి దీవెన ఉందని కొమరం భీం సినిమాలో అశోక్ తేజ రాసిన పాట గొప్ప స్ఫూర్తి నిస్తుందని అన్నారు. సినారె స్మరణలో గ్రంథాలయం కరీంనగర్ జిల్లా లో ఏర్పాటు చేసే పని జరుగుతుందని చెప్పారు. అధ్యక్షత వహించిన సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ మాట్లాడుతూ చెట్టు పై అశోక్ తేజ రాసిన అమ్మనురా నన్ను అమ్మకురా కొడుకువురా నన్ను కొట్టకురా ప్రబోధ గీతం తో మొలక నుంచి మొక్కగా ఎదిగి గీత కర్తగా మహావృక్షంగా జాతీయ అవార్డు స్థాయికి ఎదిగారని అన్నారు. ఆకలి అన్నం విలువ తెలిసిన మనస్సు వున్న కవి అశోక్ తేజ అని ప్రశంసించారు. పురస్కార ప్రదాత డాక్టర్ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వికసించిన విరబూసిన పారిజాతం సినారె అన్నారు నా రణం మరణం పై అని ప్రకటించిన ధీర కవి అయన అని చెప్పారు అశోక్ తేజ శ్రీశ్రీ వేటూరి తరువాత జాతీయ స్థాయి పురస్కారం అందుకున్న గొప్ప కవి అన్నారు. వేదిక పై ప్రముఖ దర్శకులు కోదండరామి రెడ్డి, బి గోపాల్ తదితరులు పాల్గొనగా వంశీ రామరాజు కార్యక్రమ నిర్వహణ చేశారు.

చెట్ల పొదల్లో పసికందు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన చెట్ల పొదల మధ్య కవర్లో చుట్టి వదిలి వెళ్లారు. ఈ హృదయ విదాకర ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో బుధవారం వెలుగు చూసింది.

ZAGGLE PREPAID OCEAN SERVICES LIMITED

CIN: L65999TG2011PTC074795
Regd Office : 15th Floor – Western Block, Vamasiram – Suvarna Durga Tech Park, Nanakramguda Village, Serilingampally Mandal, GHMC, Serilingampally Circle, Ranga Reddy District, 500032, Telangana, India.
Ph. No: 040 23119049, Email id: accounts.hyd@zaggle.in

30 సెప్టెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం మరియు అర్ధ సంవత్సరానికి ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం
రూ.మిలియన్లలో

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్			కన్సాలిడేటెడ్		
		ముగిసిన త్రైమాసికం 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్ధ సంవత్సరం 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.09.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన అర్ధ సంవత్సరం 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.09.2023 ఆడిట్‌చేయనివి
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	3062.95	5630.18	1849.12	3,085.70	5652.93	1849.12
2	కాలవ్యవధిలో నికర లాభం(పన్ను & మినహాయింపుగల ఐటెంలకు ముందు)	257.92	485.48	99.24	281.00	508.70	99.24
3	పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం (మినహాయింపుగల ఐటెంల తరువాత)	257.92	485.48	99.24	281.00	508.70	99.24
4	పన్ను తర్వాత కాలవ్యవధిలో నికర లాభం (మినహాయింపుగల ఐటెంల తరువాత)	185.59	352.79	75.85	202.94	370.28	75.85
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	186.17	356.31	76.21	203.52	373.80	76.21
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ. 1/- చొప్పున)	122.61	122.61	122.10	122.61	122.61	122.10
7	గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా ఇతర ఈక్విటీ (రివ్యాల్యుయేషన్ రిజర్వులు మినహాయించి)	Rs.5631.33 (As on 31-03-2024)			Rs.5631.33 (As on 31-03-2024)		
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ. 1/- చొప్పున) 1. బేసిక్ :	1.51	2.88	0.78	1.66	3.02	0.78
	2. డైల్యూటెడ్ :	1.51	2.88	0.77	1.65	3.01	0.77

గమనికలు:
1) సెబీ (లిస్టింగ్ అండ్ అధర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్ఛేంజీలతో దాఖలు చేయబడిన త్రైమాసికపు ఆర్థిక ఫలితాల యొక్క వివరణాత్మక నమూనాకు పై పేర్కొన్నవి సారాంశం. త్రైమాసికపు ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్ఛేంజీ వెబ్‌సైట్ అనగా బిఎస్‌ఇ లిమిటెడ్: www.bseindia.com నందు మరియు కంపెనీ వెబ్‌సైట్ అనగా www.zaggle.in నందు కూడాను అందుబాటులో ఉన్నాయి.
2) పై ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు సిఫారసు చేయబడినవి మరియు 13 నవంబర్, 2024న నిర్వహించిన వారి సమావేశంలో కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.

By Order of the Board
For ZAGGLE PREPAID OCEAN SERIVES LIMITED
Sd/-
Raj P Narayanam
EXECUTIVE CHAIRMAN
DIN: 00410032

Place : Hyderabad
Date : 13-11-2024

పెద్దపల్లిలో గూడ్స్ రైలు బోల్తా

- అదుపుతప్పి ఒక దానిపై ఒకటి పడిన బోగీలు
- ధ్వంసమైన మూడు లైన్ల పట్టాలు
- ఆ సమయంలో ప్యాసింజర్ రైళ్లు రాకపోవడంతో తప్పిన పెను ప్రమాదం
- 50 లోకల్ ట్రెయిన్లు రద్దు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ సమీపంలోని కన్నాల రైల్వే గేటుకు కొద్ది దూరంలో మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. కర్ణాటకలో బల్లారి నుంచి యూపీలోని గజియాబాద్‌కు స్టీల్ లోడ్‌తో 44 బోగీలతో వెళ్తున్న గూడ్స్ రైలు అదుపు తప్పి బోల్తాపడింది. బోగీల మధ్య కనెక్షన్లు తెగిపోవడంతో 11 బోగీలు ఒకదానిపై మరొకటి పట్టాలపైనే చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో లోకోపైలెట్, గాడ్ ప్రాణంతో బయటపడ్డారు. దేశ రాజధానికి వెళ్లే ప్రధాన రైలుమార్గం కావడం, మూడు లైన్ల పట్టాలూ దెబ్బతినడం.. ఆ సమయంలో ప్యాసింజర్ రైళ్లు రాకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. వెంటనే దక్షిణ మధ్య రైల్వే 50లోకల్ రైళ్లను రద్దు చేసి.. మరో 54 రైళ్లను దారి మళ్లించింది. అధిక లోడ్ కారణమా? లేక పట్టాల మెయింటెనెన్స్ లోపాలా అన్న కోణంలో రైల్వే అధికారులు విచారణ చేపట్టారు.

బల్లారి నుంచి యుపిలోని గజియాబాద్‌కు ఐరన్ కాయిల్స్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు పెద్దపల్లి - రామగుండం రైల్వే లైన్ మార్గంలోని 282/38, 282/34 కిలోమీటర్ల మధ్యన అదుపు తప్పి బోల్తాపడింది. ఆస్తి నష్టం తప్ప ప్రాణ నష్టం చోటుచేసుకోలేదు. మూడు పట్టాలు దెబ్బతిని బోగీలు చెల్లాచెదురుగా పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ లైన్‌లో ఆ సమయంలో ప్యాసింజర్ రైలు వస్తే భారీ ప్రాణ నష్టమే సంభవించేది. ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని కలుపుతూ వెళ్లే ప్రధాన రైలు మార్గం కావడంతో ఈ పెద్దపల్లి లైన్ నుంచే పెద్దఎత్తున రైళ్ల రాకపోకలు ఉంటాయి. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధ, గురువారాల్లో నడిచే 50 రైళ్లను రద్దు చేశారు. దూరప్రాంతాలకు వెళ్లే మరో 54 రైళ్లను విజయవాడ, మంచిర్యాల, నిజామాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల మీదుగా దారి మళ్లించారు. నర్సాపూర్ - సికింద్రాబాద్, సికింద్రాబాద్- నాగపూర్, హైదరాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్ టౌన్ - కరీంనగర్, కరీంనగర్ - బోధన్, సిర్పూర్ టౌన్ - భద్రాచలం రోడ్, బల్లార్షా - కాజీపేట, కాచిగూడ - కరీంనగర్ రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా పెద్దపల్లి, రామగుండం స్టేషన్ల నుంచి ప్రయాణికులు తిరుగు ప్రయాణం అయ్యేందుకు ఆర్టీసీ బస్టాండ్లలో సరిపడా బస్సులు లేక ముప్పుతిప్పలు పడ్డారు.

ట్రాక్ పునర్ధురణ పనులు చేపట్టిన అధికారులు

అధిక లోడ్ కారణమా? మెయింటనెన్స్‌లోపమా?

గూడ్స్ రైల్ బోగీల్లో స్టీల్ వైండింగ్ లోడింగ్ చేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోలేదని, కనీసం సాంకేతిక విభాగం ఈ అంశాన్ని పట్టించుకోలేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కారణంగానే గూడ్స్ రైల్ ప్రమాదానికి గురైతే మాత్రం కచ్చితంగా లోడింగ్ సమయంలో రైల్వే యంత్రాంగం నిర్లక్ష్యమే స్పష్టమవుతుంది. మరోవైపు ప్రధాన రైల్వే లైను కావడంతో ఈ లైన్‌లోని ట్రాక్‌ల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఏకధాటిగా కురిసిన వర్షాల వల్ల ట్రాక్ కింది భాగంలో నీటి నిలువలు చేరడంతో కుంగుబాటుకు గురై ఉంటుందా? లేక ట్రాక్ ఇరుపక్కల వాటర్ స్టోరేజ్ వల్ల దెబ్బతిని ఉంటుందా? నీరు నిల్వ ఉండి ట్రాక్ దెబ్బతింటే అధికారులు గుర్తించకుండా నిర్లక్ష్యం వహించారా? అన్న విషయాన్నీ తెలుసుకునే పనిలో రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు.

పునరుద్ధరణకు మరో 24గంటలు

ట్రాక్ పనులను పునరుద్ధరించే పనిలో రైల్వే యంత్రాంగం నిమగ్నమైంది. మంగళవారం అర్ధరాత్రి ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే యంత్రాంగం మరమ్మతులు మొదలెట్టారు. అప్పటికే పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సింగరేణి సంస్థతో మాట్లాడి భారీ క్రేన్లను తెప్పించి పనులు ప్రారంభించారు. ఘటనాస్థలంలో ధ్వంసమైన మూడు ప్రధాన రైల్వే ట్రాక్‌లను పునరుద్ధరించేందుకు వాటిపై ఉన్న బోగీలను తీయడంలో సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. స్టీల్ వైండింగ్ అధిక బరువు ఉండటంతో క్రేన్లతో తొలగించేందుకు ఆలస్యమవుతోంది. ఈ ఘటన గురించి తెలియగానే నాగపూర్ ఎన్నికల ప్రచారంలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మంగళవారం రాత్రి రైల్వే అధికారులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ట్రాక్‌ల పునరుద్ధరణకు గురువారం సాయంత్రం వరకు వేచి చూడాల్సిందేనని రైల్వే టెక్నికల్ అధికారులు నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే, బుధవారం సాయంత్రం కల్లా ఒక్క ట్రాక్ మీదుగా అయినా రైళ్ల రాకపోకలు కొనసాగించే విధంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నట్టు అధికారులు మీడియాతో తెలిపారు. ఘటనా స్థలంలో నెలకొన్న పరిస్థితిని చూస్తే గురువారం కూడా పునరుద్ధరణ పూర్తయ్యేలా కనిపించడం లేదు.

నేటి మధ్యాహ్నంలోపు లైన్లు పునరుద్ధరిస్తాం

అరుణ్‌కమార్ జైన్, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్

క్రెయిన్లు, ప్రోక్లెయిన్స్ సాయంతో ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టాం. బుధవారం సాయంత్రం ఆరు గంటల్లోపు దెబ్బతిన్న మూడు లైన్లలో ఒకటి అందుబాటులోకి తీసుకొచ్చాం. మిగిలిన రెండు లైన్లను గురువారం ఉదయం 11 గంటల్లోపు పునరుద్ధరణ చేస్తాం. ఇప్పటివరకు 50లోకల్ రైళ్లను రద్దు చేశాం. దూర ప్రాంతాలకు వెళ్లే 53 రైళ్లను దారి మళ్లించాం.



కొంగసాయి చంద్రరావుకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసోం రాష్ట్ర సరిహద్దుల్లో పహారా కాస్తూ మరణించిన వీర సైనికుడు కొంగ సాయి చంద్రరావు సేవలకు సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఘన నివాళి అర్పించింది. బుధవారం పట్టణంలో జరిగిన సాయి చంద్రరావు సంస్మరణ సభలో పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బండారు శరత్ బాబు మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన చంద్రరావు సేవలు చిరస్మరణీయమని అన్నారు. కొంగ సాయి చంద్రరావు తాత కొంగ సూర్యారావు మార్క్సిస్టు పార్టీ నేతగా ప్రజలందరికీ సుపరిచితులని, నిత్యం ప్రజలకు సేవ చేయాలనే తపన కలిగిన కుటుంబమని చెప్పారు. ఆ కుటుంబం నుంచి సాయి చంద్రరావు కూడా సైనికునిగా దేశానికి సేవ చేయాలనే దృక్పథంతో సైన్యంలో చేరి 12 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో సేవలు అందించారని తెలిపారు. ఇటీవల అసోం సరిహద్దుల్లో ఏనుగుల గుంపు దాడిలో గాయపడి వీరమరణం పొందారని అన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు పి సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి సీతాలక్ష్మి, యు జ్యోతి, జీవనజ్యోతి, నకిరికంటి నాగరాజు, శాఖ కార్యదర్శులు డి రామకృష్ణ, జి నాగలక్ష్మి, జి రాధ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు : సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జరుపుకునే బాలల దినోత్సవం సందర్భంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చిన్నారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మన దేశంలో ఉన్న ప్రతి బిడ్డా ఆనందంగా ఉండాలనే నెహ్రూ ఆకాంక్ష రూపమే బాలల దినోత్సవమని పేర్కొన్నారు. ఆధునిక భారతదేశం కోసం నెహ్రూ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. దేశాన్ని వెనకబాటుతనం నుంచి వికాసంవైపు నడిపించిన దార్శనికుడిగా నెహ్రూను చిరకాలం ప్రజలు గుర్తు పెట్టుకుంటారని తెలిపారు. నెహ్రూ చలవతోనే ప్రపంచ పటంలో దేశానికి ప్రత్యేక స్థానం దక్కిందని పేర్కొన్నారు. పిల్లలను జాతి సంపదగా భావించి వారి భవితవ్యానికి, అభివృద్ధికి నెహ్రూ కృషి చేశారని కొనియాడారు. నెహ్రూ ఆశయాల వెలుగులో పిల్లలకు సరైన విద్య, ఆరోగ్యం, సంక్షేమం అందించడానికి, పిల్లల హక్కుల రక్షణకు తమ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

త్వరలో డాక్టర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో డాక్టర్లతో సమావేశం నిర్వహించనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యకులు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్ నేతృత్వంలో ఆ సంఘం నాయకులు మంత్రిని కలిసి వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మంత్రికి ఆఫీస్ బేరర్లను పరిచయం చేశారు. త్వరలో జనరల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. డాక్టర్ల ప్రధాన సమస్యలైన 142 జిఓ రద్దు, పీజీ చేసిన వారి సరెండర్స్, రెగ్యులర్ ప్రమోషన్స్, వివిపిని సెకండరీ హెల్త్ గ్రేడ్ సర్వీసెస్‌గా మార్పు, సుదూర ప్రాంతాలలో పని చేస్తున్న వైద్యులకు పెరిఫెరల్ అలవెన్సు, డిహెచ్ పరిధిలో పని చేస్తున్న వైద్యులకు టైం బౌండ్ ప్రమోషన్లు తదితర డిమాండ్లపై గంటకు పైగా మంత్రితో చర్చించారు. వీటిపై మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దీనదయాళ్, నాయకులు డాక్టర్ రామ్ సింగ్, డాక్టర్ రాజు, డాక్టర్ కవి రమేష్, డాక్టర్ వినోద్, డాక్టర్ సంతోష్, డాక్టర్ రాధిక, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఇలో మాస్టర్ ట్రస్ట్ లిస్టింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ : బ్రోకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ మాస్టర్ ట్రస్ట్ లిమిటెడ్ తాజాగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఇ)లో లిస్టింగ్ అయినట్లు తెలిపింది. నవంబర్ 12 నుంచి తమ ఈక్విటీ షేర్ల ట్రేడింగ్ నవంబర్ ప్రారంభమైనట్లు మాస్టర్ ట్రస్ట్ గ్రూప్ హోల్‌టైం డైరెక్టర్, ప్రమోటర్ సిఎ జషన్ అరోరా తెలిపారు. ఇది తమ సంస్థ ప్రయాణంలో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. మార్కెట్ ఉనికితో పాటు వాటాదారులు, క్లయింట్లకు విలువను అందించడంలో ముందున్నామన్నారు. ఎన్ఎస్ఇ ప్లాట్‌ఫామ్‌లో మొత్తం 11,26,000 షేర్లు డీలింగ్‌కు కలవన్నారు. ఒక్కో షేరు ముఖ విలువ రూపాయిగా ఉందన్నారు. తమ సంస్థ సంపద నిర్వహణ, పోర్ట్‌ఫోలియో సలహా, బ్రోకింగ్, పెట్టుబడితో సహా సమగ్రమైన సేవలను అందిస్తుందన్నారు.

2.87 లక్షల స్కూళ్లకు మద్దతు : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్

హైదరాబాద్ : ప్రయివేటు రంగంలోని అతిపెద్ద విత్త సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమం పరివర్తన్‌లో భాగంగా ఇప్పటి వరకు 2.87 లక్షల పాఠశాలలకు మద్దతును ఇచ్చినట్లు తెలిపింది. గడిచిన పదేళ్లలో 2.16 కోట్ల విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసినట్లు పేర్కొంది. 20.22 లక్షల మందికి పైగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొంది. అభ్యాస స్థాయిలను పెంచడం, డిజిటల్ సాంకేతిక విద్యను అందించడానికి 3,500 పాఠశాలల్లో స్మార్ట్ తరగతులను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. 25వేల మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించినట్లు తెలిపింది.

ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ ధరల శ్రేణీ రూ.102-రూ.108

ముంబయి : నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) ఆధ్వర్యంలోని ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ నవంబర్ 19న ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్‌కు రానుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించాలని ఆ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు నవంబర్ 18నే బిడ్డింగ్ విండో తెరుచుకోనుంది. ఆ తర్వాత రోజు నుంచి రిటైల్ ఇన్వెస్టర్ల కోసం సబ్‌స్క్రిప్షన్ తెరిచి.. 22తో ముగియనుంది. ఇపిఒ ధరల శ్రేణీని రూ.102-రూ.108గా నిర్ణయించింది. ఒక్క లాట్‌లో కనీసం 138 షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.14,904 పెట్టుబడి చేయాల్సి ఉంటుంది. రిటైల్ ఇన్వెస్టర్లు గరిష్ఠంగా 13 లాట్లను కొనుగోలు చేయడానికి వీలుంది. ఈ ఏడాదిలో హ్యుందాయ్ మోటార్ ఇండియా, స్విగ్గీ తర్వాత మూడో అతిపెద్ద ఐపిఒ ఎన్‌టిపిసి ఎనర్జీనే.

భూ సమస్య నేపథ్యంలో కేసు నమోదు

- పోలీస్ స్టేషన్ ఎదుట తండ్రీ, కొడుకుల ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ బంధువులతో ఉన్న భూ సమస్యతో కేసు నమోదు కావడంతో చేర్యాల పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన తండ్రీ, కొడుకులు అవుశెర్ల సత్యనారాయణ, వెంకటేష్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన సంచలనం సృష్టించింది. కుమారుడు వెంకటేష్ విలేకరులతో మాట్లాడుతూ.. గత కొనేళ్లుగా తమ పెదనాన్నతో భూ సమస్య ఉందని, సమస్యను పరిష్కరించుకొనేందుకు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరుగుతున్నాయని తెలిపారు. కానీ, కొన్ని నెలలుగా ఈ సమస్యపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇరువురు నాయకులు తమపై పెద్ద నాన్నతో పోలీసులకు ఫిర్యాదు చేయించినట్టు చెప్పారు. వెంటనే భూ సమస్యను పరిష్కరించాలని అధికార పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తీసుకురావడంతో పోలీసులు తమను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారన్నారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పు అంటించుకునేందుకు యత్నించామని తెలిపారు. ఈ విషయమై ఎస్ఐ పి.నీరేష్ మాట్లాడుతూ.. తమపై ఎవరి ఒత్తిడి లేదని, భూమిని దున్నేందుకు వెళ్లిన ట్రాక్టర్‌ను తిప్పి పంపారని ఫిర్యాదు రావడంతో విచారణ కోసం వారిని స్టేషన్‌కు పిలిపించామన్నారు. ఇంతలోనే ఒంటిపై డీజిల్ పోసుకున్నారని తెలిపారు.

స్టింగ్ మెటావర్స్‌కు రూ.137.82 కోట్ల రెవెన్యూ

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1)లో గేమింగ్ కంపెనీ స్టింగ్ మెటావర్స్ లిమిటెడ్ రూ.137.82 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. ఇదే సమయంలో కంపెనీ నికర లాభాలు రూ.12.13 కోట్లుగా నమోదయ్యాయి. తమ గేమింగ్ వేదికలో ఆక్టివ్ గ్లోబల్ వినియోగదారుల సంఖ్య 20 లక్షలకు చేరిందని ఆ కంపెనీ తెలిపింది.

అయోడిన్ లోపంపై పిల్లల్లో అవగాహన

ప్రజాశక్తి - హైదరాబాద్ : ఐటిసి లిమిటెడ్ సహకారంతో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ పిల్లల్లో అయోడిన్ లోపం గురించి చైతన్యం కలిగిస్తోన్నట్లు పేర్కొంది. ఆరోగ్యకరమైన ఆహార పద్ధతులు, అయోడిన్ ఆహారం ప్రాధాన్యతపై ఆదిలాబాద్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ కార్యక్రమంలో బిబినగర్‌లోని ఎయిమ్స్ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అలేఖ్య పాల్గొని అయోడిన్ ప్రాధాన్యత, లోపాలపై వివరించారని పేర్కొంది. ఈ తరహా కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్లలోని తంగళ్లపల్లి స్కూల్లోనూ ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

యుఇఎల్, సిమెన్స్, టిహబ్ ఒప్పందం

ప్రజాశక్తి - హైదరాబాద్

సమగ్ర ఉన్నత విద్య కోసం యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ లండన్, సిమెన్స్, టి -హబ్ కీలక ఒప్పందం కుదుర్చుకున్నాయి. బుధవారం హైదరాబాద్‌లోని టిహబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యలో భవిష్యత్తు కోసం వినూత్న పరిష్కారాలను చర్చించడానికి విద్యా, పారిశ్రామిక రంగాలకు చెందిన ముఖ్య నాయకులను ఒకచోట చేర్చింది. ఈ భాగస్వామ్యం యుఇఎల్ విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికతలతో నిమగ్నమవ్వడానికి మరియు సస్టైనబిలిటీలో పరిశ్రమ అనుభవాన్ని పొందేందుకు ప్రత్యేకమైన అవకాశాలను అందిస్తుందని యుఇఎల్ గ్లోబల్ క్యాంపస్ వైస్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ పాల్ మార్షల్ పేర్కొన్నారు.

అధికారులపై దాడి ఘటనలో ఎంతటి వారినైనా ఉపేక్షించం

- కెసిఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై ఎస్మా ప్రయోగిస్తాం..
- పత్తి కొనుగోళ్లపై స్పందించని కేంద్ర మంత్రులు : మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై దాడి సంఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, దీని వెనుక ఎంత పెద్దవారు ఉన్నా వదిలి పెట్టేది లేదని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ నాయకుడు.. పలు కేసుల్లో నిందితునిగా ఉన్న సురేష్ పథకం ప్రకారం అధికారులపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం కలెక్టర్‌ను పిలిపించి దాడికి పాల్పడ్డారని చెప్పారు. కాళేశ్వరం, మల్లన్న సాగర్, కొండపోచమ్మ వంటి అవసరం లేని ప్రాజెక్టులకు భూసేకరణ జరిగినప్పుడు ప్రజలకు ఇబ్బంది కలిగినా ప్రభుత్వాన్ని బతిమిలాడారే తప్ప ఏ రోజూ దాడులకు పాల్పడలేదని గుర్తు చేశారు. అలాంటిది ఈ రోజు జిల్లా కలెక్టర్‌పై దాడికి దిగడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగులు, టీచర్లు, మేధావులందరూ ఈ దాడిని తీవ్రంగా ఖండించాలన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఎస్మా

కొందరు స్వార్థపరులైన మిల్లర్ల కారణంగా ధాన్యం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇబ్బంది పెట్టే మిల్లర్లపై ఎస్మా కేసులు పెడతామని మంత్రి హెచ్చరించారు. సహకరించే మిల్లర్లను ప్రోత్సహిస్తా మన్నారు. ఇప్పటికే 60 నుంచి 70శాతం ధాన్యాన్ని కొనుగోలు చేశామని, వారం రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. నామమాత్రం 10శాతం బ్యాంక్ గ్యారంటీతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం మిల్లర్లతో చెప్పినా, వారు రైతులకు సహకరించకుండా ఇబ్బందులు పెడుతున్నారని, అలాంటి వారిపై అవసరమైతే ఎస్మా కేసులు పెడతామని అన్నారు. పత్తి కొనుగోళ్లపై రైతులు ఇబ్బందులు పడుతున్నా కేంద్ర మంత్రులు ఎవరూ ఈ విషయంపై మాట్లాడం లేదని విమర్శించారు.వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి చేసినవారికి తాము అండగా ఉంటామనేలా బిఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధినేతగా ఉన్న కెసిఆర్ ఈ ఘటనపై ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు భుజంగరావు బెయిల్ రద్దు

- ఆదేశాలు జారీ చేసిన నాంపల్లి కోర్టు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన అదనపు ఎస్‌పి భుజంగరావు బెయిల్‌ను నాంపల్లి కోర్టు బుధవారం రద్దు చేసింది. గురువారం లోగా ఆయన వెంటనే చంచల్‌గూడ జైలుకు వెళ్లాలని ఆదేశించింది. తనకు పూర్తిగా బెయిల్ మంజూరు చేయాలంటూ భుజంగరావు తన న్యాయవాది ద్వారా నాంపల్లి కోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. అయితే, కేసు విచారణ కీలక దశలో ఉన్నందున భుజంగరావుకు బెయిల్ మంజూరు చేయరాదని, ప్రస్తుతం ఆయనకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌నూ రద్దు చేయాలని ఈ కేసు దర్యాప్తు చేస్తున్న జూబ్లీహిల్స్ స్పెషల్ టీమ్ పోలీసుల తరపున ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇరువురి వాదనలు విన్న తర్వాత.. భుజంగరావు తరపు న్యాయవాదుల వాదనలను న్యాయవాది తోసిపుచ్చారు. మధ్యంతర బెయిల్‌ను రద్దు చేస్తూ వెంటనే జైలుకు వెళ్లాలని ఆదేశించింది. నెల రోజుల కిందట అనారోగ్య కారణాల వల్ల తనకు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయాలంటూ భుజంగరావు కోర్టును ప్రార్థించగా వైద్యపరీక్షల నిమిత్తం ఆయనకు మంజూరు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బెయిల్ రద్దు కావడంతో గురువారం భుజంగరావు చంచల్‌గూడ జైలుకు వెళ్లి రిపోర్టు చేయనున్నారు.

ప్రియురాలి దారుణ హత్య

- పత్తి చేనులో పూడ్చి పెట్టిన ప్రియుడు
- భద్రాద్రి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేని పేట తండాలో దారుణం జరిగింది. స్వాతి అనే యువతి దారుణ హత్యకు గురైంది. ఆమె ప్రియుడు వీరభద్రం యువతిని అతి కిరాతకంగా చంపి గ్రామ సమీపంలోని పత్తి చేనులో పాతిపెట్టాడు. మూడు రోజుల తర్వాత హత్య ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచినేనిపేట తండాకు చెందిన బానోత్ వీరభద్రం.. కొత్తగూడెం పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు మణుగూరు మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన స్వాతి (32)తో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధంగా మారింది. స్వాతితో పరిచయానికి ముందే వీరభద్రానికి మాచినేనిపేట తండాకు చెందిన నందినితో వివాహం జరిగింది. స్వాతి ఆరేళ్లుగా వీరభద్రంతో సహజీవనం చేస్తూ తండాలోనే ఉంటున్నారు. రెండు నెలల కిందట సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ దంపతుల వద్ద రూ.16 లక్షలు తీసుకున్నారు. వారికి ఉద్యోగం ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని ఆ దంపతులు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. ఈ కేసులో వీరభద్రం ప్రధాన నిందితునిగా ఉన్నాడు. ఈ కేసులో స్వాతికీ హస్తం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో స్వాతిని అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 9న స్వాతిని.. వీరభద్రం ఇంట్లోనే హత్య చేసి తల్లి సహకారంతో గ్రామ సమీపంలోని తన పత్తి చేనులో పూడ్చిపెట్టాడు. ఈ విషయం ఆ నోట ఈ నోటా పోలీసుల వరకు చేరింది. వీరభద్రాన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరాన్ని ఒప్పుకున్నాడు. బుధవారం ఉదయం కొత్తగూడెం డిఎస్‌పి అబ్దుల్ రహమాన్, సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణా ప్రతాప్ హత్యకు పాల్పడిన వీరభద్రంను సంఘటనా స్థలం వద్దకు తీసుకువెళ్లి తహసీల్దార్ స్వాతి బిందు సమక్షంలో మృతదేహాన్ని వెలికి తీయించి పంచనామా నిర్వహించారు. ఈ హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని తెలిసింది. పోలీసులు వివరాలు వెల్లడించాల్సి ఉంది.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ లాభాల్లో 15 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ నికర లాభాలు 15 శాతం పెరిగి రూ.228 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.197 కోట్ల లాభాలు ప్రకటించింది.

ఇదే సమయంలో రూ.629 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో 21.5 శాతం పెరిగి రూ.764 కోట్లకు చేరింది. సెప్టెంబర్ ముగింపు నాటికి అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) రూ.22,817 కోట్లుగా నమోదయ్యింది.

నాట్కో ఫార్మా లాభాల్లో 83 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 83 శాతం వృద్ధితో రూ.676.5 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.369 కోట్ల లాభాలు నమోదు చేసింది.

ఇదే సమయంలో రూ.1,031 కోట్లుగా ఉన్న కంపెనీ రెవెన్యూ.. గడిచిన క్యూ2లో 33 శాతం పెరిగి రూ.1,371 కోట్లకు చేరింది. ఆర్థిక సంవత్సరం 2024-25కు గాను రూ.2 ముఖ విలువ కలిగిన షేర్‌పై మధ్యంతర డివిడెండ్ కింద రూ.1.50 చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. దీని రికార్డ్ తేదిని నవంబర్ 25గా నిర్ణయించింది. డిసెంబర్ 2న డివిడెండ్‌ను చెల్లించనుంది.

గ్లాంజా, అర్బన్ క్రూయిజర్‌లపై టికెఎం ఆఫర్లు

బెంగళూరు : ప్రీమియం కార్ల తయారీ కంపెనీ టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) తన గ్లాంజా, అర్బన్ క్రూయిజర్ టైసర్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌ల ప్రత్యేక ఎడిషన్‌లపై సంవత్సరాంతపు ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది. వీటిపై రూ.1 లక్షల వరకు ప్రత్యేకమైన తగ్గింపు, ఇతర ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఆఫర్లు 2024 డిసెంబర్ 31 వరకు కొనసాగుతాయని వెల్లడించింది.

ధాన్యం కొనుగోళ్లలో విఫలమైన ప్రభుత్వం

- పంటంతా దళారులపాలు : హరీశ్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గత సంవత్సరం నాలుగ లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే, ఈ సంవత్సరం కృష్ణా నదిలో నీరు రావడం, సాగర్ ప్రాజెక్టు నిండటం వల్ల దాదాపు ఐదున్నర లక్షల ఎకరాల్లో వరి సాగు అయ్యిందని తెలిపారు. దాదాపు ఏడున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు, ప్యాక్స్ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారన్నారు. కానీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ధాన్యమంతా దళారుల పాలయిందని విమర్శించారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న ముఖ్యమంత్రి నేటికీ ఆ ఊసే ఎత్తటం లేదన్నారు.

ఎన్నికల హామీలో రైతులకు అన్ని పంటలకు బోనస్, రూ.15 వేల రైతు భరోసా, రెండు లక్షలు రుణమాఫీ చేస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకొచ్చి 11 నెలలు అవుతున్నా అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందన్నారు. సివిల్ సప్లై మంత్రి ఉన్న నల్లగొండ జిల్లా రైతులే దాదాపు నాలుగైదు సార్లు రోడ్డు ఎక్కారని చెప్పారు. ఆరు గ్యారంటీల అడ్రస్సే లేదని, మహిళలకు మాత్రమే ఉచిత బస్సు ప్రయాణం పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు.

సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. కొనుగోళ్లు జరగక, మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని చేతలు మాత్రం గడప దాటడం లేదని, ఆయనకు ఎక్సైజ్ శాఖ మీద ఉన్న సోయి రైతులపై లేదని విమర్శించారు. కెసిఆర్ ప్రభుత్వంలో రైతే రాజుగా ఉన్నారని, కరోనా సమయంలో కూడా రైతులకు పెట్టుబడి సహాయం అందిందని, 11 సార్లు రైతుబంధు సహాయం అందిందని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు పొనుగోటి అంజన్‌రావు కుటుంబాన్ని హరీశ్‌రావు పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్వాయి స్రవంతి, మాజీ ఎంపిపి మెండు మోహన్ రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ బాల నరసింహ, ప్యాక్స్ చైర్మన్ పందుల యాదయ్య గౌడ్, బచ్చు రామకృష్ణ, బిఆర్ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగంగౌడ్, మాజీ ఎంపిటిసి ఊరుపక్క సరిత నగేష్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య ఉన్నారు.